ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 4 సెప్టెంబరు 2024



ఆగిన వర్షం.. మిగిలిన నష్టం

- పొంగి పొర్లుతున్న వాగులు, నిండుకుండలా ప్రాజెక్ట్‌లు
- నీట మునిగిన పంటలు

సిరిసిల్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మూడు రోజులపాటు భారీగా కురిసిన వర్షం మంగళవారం నిలిచిపోయింది. జిల్లాలో భారీ వర్షంతో శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లతోపాటు ఎగువ మానేరు ప్రాజెక్ట్ మత్తడి దూకుతోంది. సిరిసిల్ల మానేరు వాగు, మూలవాగులు పొంగిపొర్లుతున్నాయి. వరదనీరు మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోకి చేరుతుండగా దిగువకు నీటిని వదులుతున్నారు. 27.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోకి 20.89 టీఎంసీల నీరు చేరింది. ఇన్‌ఫ్లో 19430 క్యూసెక్కులు ఉండగా 6550 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్ట్ 3.50 టీఎంసీల సామర్థ్యానికి 3 టీఎంసీల నీరు చేరింది. జిల్లాలో 633 చెరువులకు 189 చెరువులు మత్తడి దూకు తుండగా 293 చెరువులు నిండుకుండలా మారాయి. జిల్లాలో చెరువులు, కుంటలు వాగులు, ఒర్రెలు జలకళతో ఉట్టిపడుతు న్నాయి.



అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో నీళ్లు

● నీట మునిగిన పంటలు

జిల్లాలో మూడు రోజులు కురిసిన వర్షాలకు పలు చోట్ల పత్తి, వరి, పంటలు నీట మునిగాయి. ఎల్లారెడ్డి పేట, వేములవాడ తంగళ్లపల్లి, కోనరావుపేట, వీర్నపల్లి, మండ లాల్లో దాదాపు 500 ఎకరాల్లో వరి, పత్తి పంటల్లోకి నీళ్లు చేరాయి.

● దెబ్బతిన్న రోడ్లు.. ఇళ్లు

జిల్లాలో వర్షాలకు గ్రామాల్లో మట్టి ఇళ్లు దెబ్బతిన్నాయి. దాదాపు పది ఇళ్ల వరకు పూర్తిగా కూలిపోయాయి. మరోవైపు రోడ్లు దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు నష్టాలను అంచనావేస్తున్నాయి. ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి తుఫాను ప్రభావంతో నష్టాలు జరగకుండా చర్యలు చేపట్టారు.

● మోస్తరు వర్షం

వర్షం పూర్తిగా తగ్గుముఖం పట్టింది. మంగళవారం జిల్లాలో మోస్తరు వర్షం పడింది. పొడి వాతావరణం ఉండడంతో ప్రజలు రోజువారీ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. రైతులు పొలాల బాట పట్టారు. పొలాల్లో నిలిచిన నీళ్లను వదిలి పంటలను సరంక్షించుకునే ప్రయత్నం చేశారు. మంగళవారం ఉదయం వరకు జిల్లాలో 3.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రుద్రంగిలో 3.7 మిల్లీమీటర్లు, వేములవాడ రూరల్, చందుర్తి 3.6, బోయినపల్లి 1.9, వేములవాడ 1.2, సిరిసిల్ల 4.0, కోనరావుపేట 2.4, వీర్నపల్లి 3.3, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట 5.3, ముస్తాబాద్ 6.6, తంగళ్లపల్లి 2.3, ఇల్లంతకుంటలో 1.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఓ కన్నేయండి



- సీక్రెట్ కెమెరాలతో జాగ్రత్త
- అప్రమత్తతే ఆయుధం
- బ్లాక్ మెయిలింగ్‌కు గురయ్యే ప్రమాదం
- లేడీస్ హాస్టళ్లలోనూ అప్రమత్తత అవసరం
- షాపింగ్‌మాల్స్‌లో పరిశీలన తప్పనిసరి
- పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెనకాడవద్దు

అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీతో అనేక లాభాలున్నా అక్కడక్కడ చోటుచేసుకుంటున్న కొన్ని సంఘటనలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రధానంగా షాపింగ్ మాల్స్, పని ప్రదేశాలు, హాస్టళ్లు, హోటళ్లు వంటి చోట్ల మహిళలు, యువతులు, విద్యార్థినులు సీక్రెట్ కెమెరాలు, సీసీ కెమెరాలపై ఓ కన్నేసి ఉంచాలి. అనుమానాలు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. వెంటనే నిర్వాహకులను నిలదీయాలి.

8 లో

▪ ఆంధ్రజ్యోతి సిరిసిల్ల

గణేష్ నవరాత్రి ఉత్సవాలను

వైభవంగా నిర్వహించుకుందాం

- జిల్లా శాంతి కమిటీ సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

8 లో

దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



దివ్యాంగులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 3: దివ్యాంగుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, వారి సంక్షేమానికి కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆది శ్రీనివాస్‌కు పలువురు దివ్యాంగులు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో వివిద శాఖల్లో ఔట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేసే ఉద్యోగాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ఉన్నా 25 ఏజెన్సీల ద్వారా భర్తీ చేసే వివిధ ఉద్యోగాల్లో దివ్యాంగులకు లభించే 3 శాతం రిజర్వేషన్లను అమలు చేసేలా చూడాలని కోరారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

చల్లంగా చూడు పోచమ్మ తల్లి



వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 3: వేములవాడ బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చిన భక్తులు 'చల్లంగా చూడు పోచమ్మ తల్లి' అంటూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి, కల్లుసాకతో పిల్లపాపలు, పాడిపంటలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు. తెల్లవారు జామునే భక్తులు మట్టిపాత్రల్లో నైవేద్యాన్ని వండుకొని డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా తరలిరావడం ఆకట్టుకుంది. బద్దిపోచమ్మ ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బోనాలతో బారులుదీరిన భక్తులు

రాజన్నకు రూ.6 కోట్ల 87 లక్షల ఆదాయం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి శ్రావణ మాసం సందర్భంగా ఆయా అర్జిత సేవలు ద్వారా 6 కోట్ల 87 లక్షల 22 వేల 90 రూపాయలు సమకూరినట్లు ఆలయ ఈవో మంగళవారం తెలిపారు. అభిషేకం టికెట్ల ద్వారా రూ.21 లక్ష 16 వేల 500, కల్యాణాల టికెట్ల ద్వారా రూ.34 లక్షల 44 వేలు, కేశఖండనం ఒకటవ కౌంటర్ ద్వారా రూ.12 లక్షల 12 వేల 450, రెండో కౌంటర్ ద్వారా రూ.3 లక్షల 10 వేల 250, కొబ్బరికాయలు, బెల్లం అమ్ముకునే లైసెన్సుల ద్వారా రూ.10 లక్షల 47 వేల 458, గండదీపం టికెట్ల ద్వారా రూ.లక్ష 9 వేల 560, ధర్మశాల అద్దెల ద్వారా రూ.43 లక్షల 80 వేల 497, కోడె మొక్కుల టికెట్ల ద్వారా రూ.కోటి 74 లక్షల 76 వేల 600, లడ్డు ప్రసాదాల ద్వారా రూ.కోటి 35 లక్షల 81 వేల 500, బ్రేక్ దర్శనం ద్వారా రూ.12 లక్షల 33వేలు, శాశ్వత కల్యాణం ద్వారా రూ.లక్ష 40 వేలు, శాశ్వత పూజల ద్వారా రూ.లక్ష 69 వేల 362, బద్ది పోచమ్మ ఆలయ సేవల టికెట్ల ద్వారా రూ.9 లక్షల 92 వేల 195, భీమేశ్వరాలయ సేవల టికెట్ల ద్వారా రూ. 3 లక్షల 6 వేల 720, సత్యనారాయణ వ్రతం టికెట్ల ద్వారా రూ. లక్ష 86 వేలతోపాటు వివిధ ఆర్జిత సేవల ద్వారా ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు.



వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం

ఎస్సైలకు కలిసిరాని చందుర్తి పోలీస్ స్టేషన్

- విధుల్లో చేరిన మూన్నాళ్లకే బదిలీ వేటు
- వరుస ఆరోపణలతో చర్యలు
- తాజాగా ఎస్సైతోపాటు కానిస్టేబుల్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్డ్
- ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వోగా ఏఎస్సై

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 3: జిల్లాలోని చందుర్తి పోలీస్‌స్టేషన్ ఎస్సైలకు కలిసిరావడం లేదు. విధుల్లో చేరిన మూన్నాళ్లకే బదిలీవేటు పడుతోంది. ఇప్పటివరకు వివిధ ఆరోపణలతో ముగ్గురు ఎస్సైలు బదిలీ కాగా సాధారణంగా మరో నలుగురు ఎస్సైలు బదిలీ అయ్యారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో 30 అక్టోబరు 2022 నుంచి ఆగస్టు 30, 2024 వరకు ఏడుగురు ఎస్సైలు విధులు నిర్వహించారు. గతంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం మండలాల ఏర్పాటు క్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చందుర్తిలో 1985లో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసింది. అపుడు చందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో 18 రెవెన్యూ గ్రామాలు ఉండేవి. దాదాపు 40 ఏళ్లలో 35 మందికిపైగా ఎస్సైలు విధులు నిర్వహించారు. 2016లో రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటు అనంతరం చందుర్తి నుంచి రుద్రంగి మండల కేంద్రంగా పోలీస్‌స్టేషన్, చందుర్తి కేంద్రంగా పోలీస్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటైంది. చందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో 19, రుద్రంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో 10 గ్రామాలు ఉన్నాయి. అక్టోబరు 30, 2021న చందుర్తి ఎసైగా జి. సంతోష్ నియామకమైన రెండు నెలలకే బదిలీ అయ్యారు. ఆ తర్వాత జనవరి 8, 2022న ఎల్.శ్రీకాంత్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఐదునెలలకే పలు ఆరోపణలతో బదిలీ వేటుపడింది. జూన్ 26, 2022న జె.రమేశ్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టి జూలై 24, 2023 వరకు ఏడాది పాటు విధులు నిర్వహించి బదిలీ అయ్యారు. ఆ తర్వాత చందుర్తి ఎస్సైగా జూలై 24, 2023న ఎస్. అశోక్ బాధ్యతలు చేపట్టిన నాలుగు నెలలకే బదిలీ వేటుపడింది. జనవరి 19, 2024న వి.వెంకటేశ్వర్లు ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఈయనపై పలు ఆరోపణలు రావడంతో 18 రోజులకే బదిలీ వేటుపడింది. ఫిబ్రవరి 8, 2024న ఎస్. ప్రేమానందనం ఎస్సైగా బాధ్యతలు చేపట్టగా 11 రోజులకే బదిలీ చేశారు. ఆ తర్వాత ఫిబ్రవరి 19, 2024న చందుర్తి ఎస్సైగా సీహెచ్. శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టారు. ఈయనపై తిమ్మాపూర్ గ్రామంలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన ఘర్షణను అదుపు చేయడంలో విఫలమయ్యారనే ఫిర్యాదు పోలీసు ఉన్నతాధికారులకు చేరింది. ఇదే కాకుండా చందుర్తి సింగిల్ విండో సొమ్ము స్వాహాలో కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం చేశారని ఆరోపణలు రావడంతో స్పెషల్‌బ్రాంచ్ పోలీసుల విచారణ నేపథ్యంలో ఎస్సై శ్రీకాంత్‌ను ఆరునెలలకే ఆగస్టు 30న జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేశారు. అదే విధంగా ఎస్సైపై బదిలీ వేటుపడిన మూడు రోజులకే చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ భాస్కర్‌ను పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేశారు. ఎస్సైని, కానిస్టేబుల్‌ను జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేయడం చందుర్తిలో చర్చనీయాంశమైంది. రెండేళ్లలో ముగ్గురు ఎస్సైలపై పలు ఆరోపణలతో బదిలీ వేటుపడగా మరో నలుగురు ఎస్సైలకు సాధారణ బదిలీ అయ్యిందని చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం చందుర్తి ఎస్‌హెచ్‌వోగా ఏఎస్సై బాపుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. తిరిగి ఇక్కడికి ఎవరూ ఎస్సైగా వస్తారనేదానిపై ఆసక్తి నెలకొంది.



పిల్లలు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 3: పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోషణ లోపంతో ఉన్నవారికి మెరుగైన వైద్యం అందించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఈ నెల 30 వరకు చేపట్టనున్న పోషణ్ అభియాన్‌పై మంగళవారం కలెక్టరేట్ నిర్వహించిన జిల్లా స్థాయి కన్వర్జేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడారు. పోషణ లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వారితోపాటు హాస్టళ్లు, స్కూళ్లలో విద్యార్థులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. సీనియర్ ఎనిమిక్‌తో బాధపడుతున్న వారిని గుర్తించి జిల్లా ఆసుపత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రిలో చేర్పించి చికిత్సను అందించాలని సూచించారు. పోషణ లోపం, తీవ్ర పోషణ లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి అదనపు పోషకాహారం అందించాలన్నారు. వైద్య పరీక్షలు చేపట్టి పిల్లలు సాధారణ స్థితికి వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. అంతకుముందు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం జిల్లాలో పోషణ మాసం షెడ్యూల్, కార్యాచరణ ప్రణాళికను వివరించారు. బుధవారం విలేజ్ హెల్త్ శానిటేషన్ అండ్ న్యూట్రిషన్ డే నిర్వహించాలని, పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి బాలామృతం, బాలామృతం ప్లస్ అందించాలని అన్నారు. ఇంటింటికి అంగన్‌వాడీ కార్యక్రమంలో భాగంగా గురువారం పోషణ లోపంతో బాధపడుతున్న పిల్లల ఇంటి వద్దకి వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. మాతృ మరణాల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేస్తామని, జాగ్రత్తలను వివరిస్తామని తెలిపారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో ఫుడ్ ప్రిపరేషన్ నిర్వహిస్తామన్నారు. అనంతరం పోషణ మాసం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ వినోద్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు, డీఆర్డీఓ శేషాద్రి, డీఏఓ అఫ్జల్ బేగం, డీఎస్ సీడీఓ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్లు మీర్జా ఫసహత్ అలీ బేగ్, సంపత్ రెడ్డి, డీఎల్‌పీవో రాజు తదితరులు పాల్గొన్నారు.



పోషణ మాసం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

రుద్రంగి, సెప్టెంబరు 3: గ్రామపంచాయతీ చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని డీఆర్డీవో శేశాద్రి హెచ్చరించారు. రుద్రంగి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై మంగళవారం సామాజిక తనఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన వివిధ రకాల పనుల వివరాలను అధికారులు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనులు చేపట్టిన అనంతరం పంచాయతీ కార్యదర్శులు కూలీల నుంచి మస్టర్‌లో సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు కూలీలకు డబ్బులు అందించాలన్నారు. పనుల్లో అవకతకవకలకు పాల్పడి, నిర్లక్ష్యం వహించినవారికి రికవరీ జరిమానా విధించారు. మండంలో 2 కోట్ల 60 లక్షల పనులు చేపట్టినట్లు అధికారులు వివరించారు. విజిలెన్స్ అధికారి రామారావు, డీఈ పవనకుమారి, ఏఈ మనోహర్, ఎంపీడీవోలు శంకర్, నటరాజ్, ఎంపీవో సుధాకర్ పాల్గొన్నారు.



పేకాటరాయుళ్ల పట్టివేత

కథలాపూర్, సెప్టెంబరు 3: మండలంలోని సిరికొండ శివారులో మంగళవారం సాయంత్రం పోలీసులు పేకాట శిబిరంపై దాడులు చేసి 11 మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. గ్రామ శివారులో పేకాడుతున్నట్లు స మాచారం రావడంతో దాడులు నిర్వహించి వారి నుంచి రూ.74,220లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ తెలిపారు.



బావిలో పడిన ఎలుగుబంటి

● నిచ్చెన ఏర్పాటు చేయడంతో

బయటికి వచ్చినట్లు గుర్తించిన అధికారులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3: ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి శివారులోని పాడుబడిన వ్యవసాయ బావిలో ఎలుగుబంటి పడిందనే సమాచారంతో వెంకటాపూర్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మోహన్‌లాల్ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. గ్రామ శివారులోని బావిలో నుంచి ఎలుగుబంటి అరుపులు రావడంతో గమనించిన చుట్టు పక్కల రైతులు సోమవారం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న డీఆర్వో మోహన్‌లాల్, ఎఫ్‌బీవో అనూష పరిశీలించారు. ఎలుగుబంటిని కాపాడేందుకు స్థానికుల సహాయంతో చర్యలు చేపట్టారు. సుమారు 15 మీటర్ల లోతు ఉన్న పాడు బడిన వ్యవసాయ బావిలో నిచ్చెనలను ఏర్పాటు చేశారు. చీకటి పడడంతో వెనుదిరిగారు.



అటవీశాఖ అధికారులు బావిలో ఏర్పాటు చేసిన నిచ్చెన

మంగళవారం చేరుకొని పరిశీలించారు. బావిలో నుంచి శబ్దం వినిపించ లేదని, నిచ్చెనకు ఎలుగుబంటి వెంట్రుకలు కనిపించాయని, బావిలోంచి ఎలుగుబంటి నిచ్చెన ద్వారా బయటకు వెళ్లిన ఆనవాళ్లను గుర్తించామని డీఆర్వో మోహన్‌లాల్ పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 3 : జగిత్యాల మండలం పెర్కపల్లి లోలెవల్ వంతెన వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన తునికి జగన్(46) అనే వ్యక్తి మృతి చెందాడు. రేచపల్లి గ్రామానికి చెందిన జగన్ రాత్రి తన పని నిమిత్తం హన్మాజీపేట వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి జగిత్యాలకు వస్తున్న క్రమంలో హన్మాజీపేట లోలెవల్ వంతెన వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

దంపతులకు గాయాలు


ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామ శివారులో మంగళవారం కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపు తప్పి భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామానికి చెందిన తిరుపతి తన భార్యతో కలిసి బైక్‌పై ఎల్లారెడ్డిపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఒక్కసారిగా కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు. =కాంగ్రెస్ నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, రాంరెడ్డి గమనించి మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని ట్రాలీ ఆటో బోల్తా

● ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొని ట్రాలీ ఆటో మంగళవారం బోల్తా పడింది. ఈ సంఘటనలో సిరిసిల్ల పట్టణానికి చెందిన మధుకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపునకు వెళుతున్న ట్రాలీ ఆటో మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులో డివైడర్‌ను అతి వేగంగా ఢీకొట్టి ప్రధాన రహదారిపై తలకిందులైంది. ఆ సమయంలో రోడ్డు వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. కాగా ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.











ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	2,20,473	1,95,853	80.5	70.425
ఎల్లంపల్లి	4,72,354	4,72,064	20.175	14.248
మిడ్ మానేరు	17,680	6,400	27.54	21.52
ఎల్ఎండీ	2,708	277	24.034	16.26
ఎగువమానేరు	27,500	-------	2.00	2.00

ఇద్దరు బ్యాటరీల దొంగల అరెస్టు

పెగడపల్లి, సెప్టెంబరు 3: పెగడపల్లి మండలంలో ఇద్దరు బ్యాటరీల దొంగలను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. నెల రోజులుగా మండలంలోని నందగిరి, అయిత్‌పల్లి గ్రామాలలో బయట నిలిపిన డీసీఎం వ్యానుల నుంచి బ్యాటరీలు దొంగిలిస్తున్నారనే ఫిర్యాదులు న్నాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపి బ్యాటరీలు దొంగిలించిన మాదవేని ప్రశాంత్, ఉబిది అంజయ్య లంబాడిపల్లిలను అరెస్టు చేసి, అయిత్‌పల్లి శివారులో దాచి ఉంచిన బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

రెండు షాపుల్లో దొంగతనం

రామడుగు, సెప్టెంబర్ 3: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో పక్కపక్కనే ఉన్న రెండు దుకాణాల్లో మంగళవారం చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర మెకానిక్ సెంటర్, వెంకటేశ్వర ఇంజనీరింగ్ వర్క్ షాప్ యాజమానులు రోజులాగే సోమవారం రాత్రి షాపు తాళం వేసి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి అశోక్ అనే వ్యక్తి షాపు కౌంటర్‌లో నుంచి రూ.15 వేల నగదు, శంకరయ్య అనే వ్యక్తి షాపులో నుంచి రూ.2 వేల నగదు చోరీ అయింది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

విద్యార్థులూ పాఠశాలకు రండి

పెద్దాపూర్ గురుకులం... నెల రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారి తీసిన పాఠశాల. విద్యార్థుల వరుస మరణాలు, కొందరు విద్యార్థుల అస్వస్థత అటు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పాఠశాల యాజమాన్యాన్ని, అధికారులను ఆందోళనకు గురిచేసింది.పాఠశాల చుట్టూ అపరిశుభ్రత, విద్యార్థులకు కనీస వసతుల లేమి, పాత భవనాల్లోనే పాఠాల కొనసాగింపు ఇలా రకరకాల సమస్యలు ఒక్కసారిగా తెరపైకి వచ్చాయి. 15 రోజుల్లో ఇద్దరు విద్యార్థుల మృతి, మరో నలుగురు విద్యార్థులు అస్వస్థతతో ఆస్పత్రిలో చేరడంతో తల్లిదండ్రులు భయాందోళనలకు గురయ్యారు.

తమ పిల్లలకు ఏం జరుగుతుందో అని ఒక్కొక్కరుగా వారి వారి పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. పాఠశాలలో వరుస మరణాలతో ప్రభుత్వం తక్షణ చర్యలకు పూనుకుంది.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాఠశాలను తనిఖీ చేసి అధికారులకు మౌలిక వసతుల కల్పనకు ఆదేశాలు జారీ చేశారు. ఆ సంఘటన తరువాత నెల రోజుల పాటు మూతపడ్డ పాఠశాల అన్ని రకాల వసతులు కల్పించి మళ్లీ పునఃప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి ఒక్కొక్కరినీ పిలుస్తున్నారు.

● నేటి నుంచి పెద్దాపూర్ గురుకులం పునః ప్రారంభం ● వసతులు కల్పించిన అధికారులు ● ఫోన్లు చేసి పిలుస్తున్న ఉపాధ్యాయులు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 3: ఇన్ని రోజులూ సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడిన మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో సౌకర్యాలు కల్పించడంతో బుధవారం నుంచి పునఃప్రారంభం కానుంది. ఇటీవల పాఠశాలలో పలు ఘటనలు జరగడంతో అధికారులు విద్యార్థులకు సెలవులు ప్రకటించారు. గురుకులం పాఠశాల, కళాశాలలో మొత్తం 540 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలోని విద్యార్థుల మరణాలు, అస్వస్థతకు గురైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. గురుకుల పాఠశాలలో వరుసగా జరిగిన సంఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. పాఠశాలకు రావడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల పాఠశాలలో వరుస విద్యార్థుల మరణాలతో బెంబేలెత్తిన అధికారులు పాఠశాలలో వసతులు కల్పించారు. వరుస ఘటనలతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాఠశాలను సందర్శించారు. గురుకులంలోని గదులు, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలని నిధులు మంజూరు చేశారు. దీంతో పాఠశాలకు సుమారు ఇరవై రోజుల పాటు సెలవులు ప్రకటించారు.

ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు

గురుకుల పాఠశాలలో వరుసగా జరిగిన సంఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, పనులు చేపట్టాలని ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు వసతులు కల్పించారు. గతంలో పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్డు, చిన్నపాటి బావులు, పిచ్చి మొక్కలు తొలగించారు. పారిశుధ్య పనులు చేపట్టారు. చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు శానిటేషన్ చేశారు. నూతన భవనంలో కరెంట్, ప్లంబింగ్, కిటికీలు, కావాల్సిన మరమ్మతులను చేయించారు. విద్యార్థులు పడుకోవడానికి బెడ్‌లు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసుతులు కల్పించారు.

పాఠశాలకు రావాలని ఉపాధ్యాయుల ఫోన్లు

గురుకులంలో చదువుకునే విద్యార్థులు తిరిగి పాఠశాలకు రావాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు రెండు రోజుల నుంచి ఫోన్లు చేస్తున్నారు. గురుకులంలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల వసతులు ఏర్పాటు చేశామని, విద్యార్థుల భవిష్యత్ కోసం తమ పిల్లలను గురుకులం తిరిగి పంపించాలని తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఫోన్ల ద్వారా సమాచారం అందిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులు నష్టపోతున్నారని, వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు పంపించాలని కోరుతున్నారు.



పెద్దాపూర్ గురుకుల పాఠశాల

అధికారుల సూచనల మేరకు ప్రారంభం

- మాధవీలత, ప్రిన్సిపాల్

చదువులో విద్యార్థులు నష్టపోకుండా ఉన్నత అధికారుల సూచనల మేరకు పదవ తరగతి, ఇంటర్ మీడియట్ కళాశాల విద్యార్థులకు కోసం తరగతులు ప్రారంభిస్తున్నాం. మరో వారంలోగా పూర్తి స్థాయిలో అన్ని తరగతులు ప్రారంభిస్తాం. పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన వసతులను ఏర్పాటు చేశాం. విద్యార్థులను పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరుతున్నాం.

ఘనంగా వ్యవసాయ యూనివర్సిటీ ఫౌండేషన్‌డే

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 3: ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆవిర్భావం జరిగి పదేళ్ల గడుస్తున్న సందర్భంగా జగిత్యాల వ్యవసాయ పరిశోధన స్థానం పొలాసలో యూనివర్సిటీ ఫౌండేషన్‌డే దశాబ్ది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ శ్రీలత హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పొలాస పరిశోధన స్థానం నుంచి విడుదల అయిన వరి, నువ్వుల వంగడాలు, సాంకేతిక పరిజ్ఞానం అత్యంత ప్రాచుర్యం పొందాయన్నారు. అదే విధంగా విద్యార్థులు బాగా చదివి మంచి ర్యాంకులు సాధించాలన్నారు. ఈ యేడాది అగ్రికల్చర్ పాలిటెక్నిక్ జగిత్యాలకు ఉత్తమ అవార్డు రావడం సంతోషకరం అన్నారు. అలాగే పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డా.బలరాం నాయక్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బెస్ట్ టీచర్, సైంటిస్టు అవార్డు, నాన్‌టీచింగ్ స్టాఫ్‌లో పోసవ్వకు ఉత్తమ ఆఫీస్ సబార్డినేట్‌గా అవార్డులు రావడం అభినందనీయం అన్నారు. అన్ని రకాల అధికారులు, సిబ్బంది, కార్మికులు సమన్వయంతో పనిచేసి యూనివర్సిటీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో దేవయ్య, అసిస్టెంట్ కంప్ట్రోలర్ పురుషోత్తం, వివిధ హోదాల అధికారులు, శాస్త్రవేత్తలు, సిబ్బంది, కార్మికులతో పాటు కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం 10వ వార్షికోత్సవాన్ని రాజేంద్రనగర్ యూనివర్శిటీ నుంచి యూట్యూబ్ ద్వారా లైవ్‌లో వీక్షించారు.



సంబరాల్లో పాల్గొన్న పొలాస పరిశోధన స్థానం అధికారులు, శాస్త్రవేత్తలు

గల్లంతైన మత్స్యకార్మికుడు మృతి

- వాగు సమీపంలో మృతదేహం లభ్యం

గంభీరావుపేట, సెప్టెంబరు 3: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలం మానేరు సమీపాన లచ్చపేట వాగువద్ద గల్లంతైన మత్స్యకార్మికుడు మృతి చెందాడు. వాగు ప్రవాహం తగ్గడంతో మంగళవారం అతడి మృతదేహం లభ్యమైంది. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేటకు చెందిన శివరాములు అనే మత్స్య కార్మికుడు ఆదివారం ఉదయం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలం మానేరు సమీపాన లచ్చపేట వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ వెళ్లారు. వాగు ఒడ్డున శివరాములు దుస్తులు, చెప్పులు కనిపించడంతో గల్లంతయినట్టు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజులుగా వాగు పరివాహక ప్రాంతాల్లో గాలించినా శివరాములు ఆచూకీ లభించలేదు. మంగళవారం వరద ప్రవాహం తగ్గడంతో లచ్చపేట శివారులో వాగు ప్రాంతంలో శివరాములు మృతదేహం లభించింది.

దుబాయ్‌లో క్షమాభిక్ష ప్రక్రియ షురూ

- అక్రమంగా ఉంటున్న వలస కార్మికులకు ఊరట

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 3: దుబాయ్‌లో మళ్లీ క్షమాభిక్ష ప్రక్రియ మొదలైంది. దుబాయ్ ప్రభుత్వం ఐదేళ్ల తరువాత అమ్నెస్టీ ప్రకటించడంతో అక్రమంగా ఉంటున్న వలస కార్మికులకు ఊరట లభించింది. దీంతో ఐదేళ్లుగా దుబాయ్‌లో వీసా గడువు ముగిసి అక్కడే ఉంటున్న కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ క్షమాభిక్ష సెప్టెంబరు 1న ప్రారంభమైనా అక్టోబరు 31తో ముగియనుంది. దుబాయ్‌లో చట్ట విరుద్ధంగా తెలంగాణప్రాంతానికి చెందిన దాదాపు 40 వేల మంది వలస కార్మికులు ఉంటారని అంచనా. దుబాయ్ ప్రభుత్వం అమ్నెస్టీ ప్రకటించడంతో వలస కార్మికులు తిరిగి స్వగ్రామాలకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వేలాది మంది విజిట్ వీసాపై వెళ్లి అక్కడే ఉంటూ వివిధ ఉపాధి పనులు చేసుకుంటున్నా వలస కార్మికులు తిరిగి వచ్చేందుకు ఇండియన్ ఎంబసీ వద్ద క్యూ కడుతున్నట్లు తెలిసింది. దుబాయ్‌లో వీసా గడువు ముగిసి అక్రమంగా ఉంటున్న వలస కార్మికులు టికెట్, అవుట్ పాస్‌పోర్టు కోసం సొంతంగా ఖర్చులు భరించాల్సి ఉంటుంది. ఈ ఖర్చులతో కలిపి దరఖాస్తు చేసుకుంటే దుబాయ్ నుంచి తిరిగి వచ్చేందుకు అవుట్ పాస్ అనుమతి లభిస్తుంది. దుబాయ్‌లోని వివిధ క్యాంపులలో అక్రమంగా ఉంటున్న వలస కార్మికులకు క్షమాభిక్ష ద్వారా తిరిగి వచ్చేందుకు సదవకాశం లభించింది.

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 3: కరీంనగర్‌లోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన మసీదు మహేష్(40) సోమవారం అర్ధరాత్రి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మహేష్ 15 రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఏ పనిచేయలేక పోతున్నాడని, మనస్తాపంతోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి సోదరుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

12లోగా ఎంఫార్మసీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 3: ఎస్‌యూ పరిధిలోని ఎం.ఫార్మసీ రెండో, నాలుగో సెమిస్టర్ విద్యార్థులు, బి.ఫార్మసీ 2, 4, 6వ సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ) విద్యార్థులు ఈనెల 12లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 18వ తేదీ వరకు చెల్లించడానికి గడువు ఉందని తెలిపారు. పరీక్షలను సెప్టెంబరు లేదా అక్టోబరు నెలలో నిర్వహించనున్నారు.

జ్వరంతో యువకుడి మృతి



రాజ్ కుమార్(ఫైల్)

సారంగాపూర్, సెప్టెంబరు3: మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన చెంది రాజ్ కుమార్(30) అనే యువకుడు జ్వరంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పెంబట్ల గ్రామానికి చెందిన రాజ్ కుమార్ పెంబట్ల, కోనాపూర్ సహకార సంఘం కార్యాలయంలో సీఈవోగా విధులు నిర్వహిస్తున్నాడు. 15 రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నా తగ్గక పోవడంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ రాజ్‌కుమార్ మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, భార్య ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరామర్శించారు.

వరద నీటిపై ప్రజలను అప్రమత్తం చేయాలి

● శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వస్తున్న వరద నీటిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మంత్రి రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్‌తో కలిసి సందర్శించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీటిని, గోదావరిలోకి వదిలిపెడుతున్న నీటిని ఆయన పరిశీలించారు. వరద పరిస్థితిని ఆయన నీటి పారుదల శాఖాధికారులతో తెలుసుకున్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా కలెక్టర్లు కోయ శ్రీహర్ష, కుమార్ దీపక్‌కు పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితులను అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గత ఏడాది ఒకేసారి 8 లక్షల క్యూసెక్కుల వరద నీరు రావడంతో జిల్లాలోని గోదావరిఖని, మంథని పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయని, అలాంటి పరిస్థితులు పునరావృతంగా కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంచిర్యాల, చెన్నూర్ ప్రాంతంలోని గోదావరి తీర ప్రాంత ప్రజలను కూడా అప్రమత్తం చేయాలన్నారు. విపత్తులు సంభవిస్తే సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని రామగుండం సీపీ శ్రీనివాస్‌కు సూచించారు.



వరద పరిస్థితిపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ప్రాజెక్టులకు కొనసాగుతున్న ప్రవాహం

జగిత్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద పోటెత్తుతోంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 2,20,473 క్యూసెక్కుల నీరు వస్తుంటే...41 గేట్లు పైకి ఎత్తి దిగువకు 2,20,473 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మరో 17 వేల క్యూసెక్కులు వరద కాలువకు, 4 వేల క్యూసెక్కులు కాక తీయ కాలువకు, 4 వేల క్యూసెక్కులు ఎస్కేప్ గేట్ల ద్వారా విద్యుత్తు తయారీకి విడు దల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 70.140 టీఎంసీల నీరు ఉంది.

ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద..

పెద్దపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి పెద్దఎత్తున వరద నీరు వస్తున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీటితో పాటు క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వరద నీరంతా ప్రాజెక్టులోకి వస్తున్నది. మంగళవారం సాయంత్రం వరకు 4,72,354 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి 2,59,928 క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 2,12,426 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. దిగువకు 4,72,064 క్యూసెక్కుల నీటిని 32 గేట్ల ద్వారా గోదావరిలోకి వదిలిపెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.248 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరుకు ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతో ఇక్కడి నుంచి ఎత్తిపోతలను సోమవారం ఉదయం నుంచే నిలిపి వేశారు.

మిడ్ మానేరుకు వరద

బోయినపల్లి : శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎగువ భాగాన కురిసిన వర్షంతో మానేరు, మూల వాగు ఎస్సారెస్పీ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 17,680 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇందులో మానేరు, మూలవాగు ద్వారా 4080, ఎస్సారెస్పీ నుంచి 13,100 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరు తోంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటి ని తరలి స్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 315.27 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27. 54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 21.52. టీఎంసీల మేరకు ఉంది. నేటి నుండి ఉదయం నుండి ఎల్ఎండి ప్రాజెక్టుకు 10 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేయనున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.



కోటిలింగాల వద్ద గోదావరిని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

ఎల్ఎండీలోకి తగ్గుతున్న వరద

తిమ్మాపూర్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోనికి మోయతుమ్మెద వాగు నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరింది. అయితే మంగళవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో ఎగువ నుంచి మోయతుమ్మెద వాగు నుంచి వస్తున్న వరద తగ్గింది. జలాశయంలోనికి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గింది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టిఎంసిలు కాగా ప్రస్తుతం 16.263 టిఎంసిలకు చేరుకుంది. మోయతుమ్మెద వాగు నుంచి 5,805 క్యూసెక్కులు, ఎగువ ఎల్ఎండి నుంచి 769క్యూసెక్కులు మొత్తం 6,574 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి రాగా రాత్రి వరకు 2,708కి పడిపోయింది. అవుట్ ఫ్లో 277 క్యూసెక్కులు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ధర్మపురి వద్ద ఉధృతంగా గోదావరి

ధర్మపురి : ధర్మపురి వద్ద గోదావరి వరద మంగళవారం సాయంత్రం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ధర్మపురి చుట్టు పక్కల గ్రామాలకు చెందిన నదీ తీరాన గల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గోదావరి నీటి మట్టం క్షణక్షణం పెరిగి వేగంగా ప్రవాహం కొనసాగింది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ సిబ్బంది అప్రమత్తం చేశారు. అలాగే నదీ తీరాన గల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు తహసీల్దార్ కృష్ణ చైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి పరిశీలిస్తున్నారు.



ఎల్ఎండీ జలాశయం

కోటిలింగాల వద్ద కొనసాగుతున్న వరద

వెల్గటూర్: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎస్పీ అశోక్ కుమార్ కోటిలింగాల వద్ద గోదావరి వరద తీవ్రతను పరిశీలించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయా లని అధికారులను ఆదేశించారు. కోటిలింగాల, చెగ్యాం వద్ద గోదావరి పరి వాహక ప్రాంతాలలో పర్యటించి, ప్రజలు, మత్స్యకారులు పశువుల కాపర్లు గోదావరిలోకి వెళ్లవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉమా సాగర్ పాల్గొన్నారు.

13న కొండగట్టు తలనీలాల టెండర్లు

● మూడవ సారి నిర్వహణకు ఏర్పాట్లు

● హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో టెండర్లు



కొండగట్టు అంజన్న ఆలయం

మల్యాల, సెప్టెంబరు 3: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో భక్తులు సమర్పించే తలనీలాల పోగు చేసుకునేందుకు గాను దేవస్థానం అధికారులు మరో సారి టెండర్లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే రెండు సార్లు టెండర్లు నిర్వహించగా తగిన వేలం రాకపోవడంతో వాయిదా వేసిన అధికారులు మూడవ సారి ఈ నెల 13న నిర్వహించనున్నారు. ఈ ఆగస్టు నుంచి వచ్చే ఏడాది జూలై నెలాఖరు కాలపరిమితికి గాను హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో ఈ-టెండర్, సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం జరుగనుంది. మొదటి సారి టెండర్ ఫిబ్రవరి 7న నిర్వహించిన వేలంలో రూ.కోటి 62లక్షల 1116 హెచ్చు పాట రాగా ఈ సారి అక్కడి నుంచే వేలం ప్రారంభించనున్నట్లు ఈవో రామకృష్ణారావు తెలిపారు. మరిన్ని వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించవచ్చునని అన్నారు.

ఘనంగా గోపాల కాల్వలు

ధర్మపురి, సెప్టెంబరు 3: శ్రావణ మాసం ముగింపు సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో గోపాల కాల్వలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏటా నిర్వహించే విధంగా ఉదయం స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి, రామ లింగేశ్వర స్వామి వారలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఉగ్ర నారసింహుని ఆలయంలో రాజ రాజేశ్వరి భజనా మండలి సభ్యులు, ఆర్యవైశ్యులు, భక్తులు భజనా కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, వేద మంత్రాల మధ్య అందంగా పూలతో అలంకరణ చేసిన స్వామి వారలకు అభిషేకం, విశేష పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆర్యవైశ్యులు, భక్తులు గోదావరి నది వరకు ఊరేగింపు జరిపారు.

జమ్మికుంటలో గంజాయి పట్టివేత

● ఐదుగురు యువకులపై కేసు

జమ్మికుంట రూరల్ ,సెప్టంబర్ 3: పట్టణంలోని గణేష్‌నగర్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న యువకుల వద్ద నుంచి 700 గ్రాముల గంజాయిని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గణేష్‌నగర్‌లో నలుగురు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా యువకులను గమనించారు. అనుమానాస్పదంగా ఉండటంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బావండ్ల పల్లి అఖీల్,వస్తం కూమార్, చాండల్య కిషోర్, వి విష్ణువర్ధన్‌తో పాటు గంజాయి విక్రయించిన బిజిగిరి షరీఫ్‌కు చెందిన ఎండి అక్రమ్‌పై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ వరగంటి రవి తెలిపారు. గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● పెళ్లైన 15 రోజులకే మృత్యు ఒడికి

● విషాదంలో కుటుంబం

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 3: పెళ్లైన 15 రోజులకే ఓ యువకుడు మృతిచెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. భర్తతో కలిసి నూరేళ్ల జీవితాన్ని ఎంతో సంతోషంగా గడపాలనుకున్న ఆ ఇల్లాలి కలలు కళ్లలయ్యాయి. మండలంలోని గుమ్లాపూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మేడిపల్లి మండలం వల్లంపల్లి గ్రామానికి చెందిన నవీన్ (26) మృత్యువాత పడ్డాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నవీన్ ఉపాధి నిమిత్తం సింగపూర్ వెళ్లి గత నెలలో తిరిగి వచ్చాడు. నవీన్‌కు గత నెల 18 చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. కటకం నవీన్, ఎలిశెట్టి భూమేశ్వర్, పార్థసారధి ముగ్గురు స్నేహితులు ద్విచక్ర వాహనంపై మాచాపూర్ మీదిగా కోరుట్ల పట్టణానికి వస్తున్నారు. గుమ్లాపూర్ గ్రామ శివారులో వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని గుమ్లాపూర్ గ్రామం వైపు వెలుతున్న ఆటో ఢీకొట్టింది. ఈ సంఘటనలో నవీన్ భూమేశ్వర్ తీవ్ర గాయాల పాలయ్యారు. పార్థసారధికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికు లు వెంటనే 108 ద్వారా క్షతగాత్రులను కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నవీన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భూమేశ్వర్‌కు ప్రథమ చికిత్సను అందించి మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని రాత్రి 8 గంటల వరకు కూడా పోలీసులు పరిశీలించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



నవీన్ (ఫైల్)

జమ్మికుంటలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ నిలపాలి

- రైల్వే మంత్రికి బండి సంజయ్ లేఖ

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జమ్మికుంట, సెప్టెంబర్ 3: జమ్మికుంట రైల్వేస్టేషన్లో గత 30సంవత్సరాలుగా ఆగుతున్న దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఎత్తి వేసిన విషయంపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కేంద్ర రైల్వే శాఖ మంత్రికి లేఖ రాశారు. గత నెల 6వ తేదీన 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కేంద్ర హోం సహాయక మంత్రి బండి సంజయ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని ప్రస్తావించారు. జమ్మికుంట వ్యాపార కేంద్రమని, ఎంతో మంది వ్యాపారులు, ఉద్యోగులు, ప్రజలు దక్షిణ్‌లో రాకపోకలు సాగిస్తారన్నారు.

నిండుకుండలా అన్నపూర్ణ రిజర్వాయర్

ఇల్లంతకుంట, సెప్టెంబరు 3: మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ నిండుకుండలా మారింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీరు ప్రస్తుతం 3 టీఎంసీలకు చేరుకుంది. మధ్యమానేరు ద్వారా 6400 క్యూసెక్కుల నీరు వస్తుండగా రెండు పంపుల ద్వారా రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఎగువన ఉన్న సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఫిబ్రవరిలో జలాశయం డెడ్‌స్టోరేజీకి చేరి పూర్వపు అనంతగిరి గ్రామంలోని ఇళ్ల శిథిలాలు బయటపడ్డాయి. కొద్దినెలల్లోనే అన్నపూర్ణ రిజర్వాయర్‌కు జలకళ రావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా అనంతారం ప్రాజెక్టును నింపాలని రైతులు కోరుచున్నారు.

కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామ శివారులోని పెద్ద చెరువు కట్టపై వెనుక భాగంలో కోతకు గురైన ప్రాంతాన్ని నీటి పారుదల, తహసీల్ అధికారులు మంగళవారం పరిశీలించారు. మరమ్మతు పనులు చేపడుతామని చెప్పారు. చెరువు కట్టకు ప్రమాదం లేదని స్పష్టం చేశారు. నీటి పారుదల శాఖ డీఈ సత్యనారాయణ, ఏఈ భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ సంతోష్, రైతులు, ముదిరాజ్ సంఘం సభ్యులు ఉన్నారు.

సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 3: సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం నివారించాలని, వాటిపై ఆధారపడిన నేతన్నలకు ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. చేనేత జౌళి శాఖ కార్యాలయంలో మంగళవారం అధికారులను కలిశారు. నేతన్నలకు ఉపాధి కల్పించడంతోపాటు వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ యజమానులు స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారని, అలాంటి యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అజ్జవేణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 3: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ప్రధానోపాధ్యాయిని ప్రేమలత సూచించారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మంగళవారం రూం టు రీడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రీడ్ ఏ థాన్‌లో భాగంగా విద్యార్థులు పఠనాసక్తిని పెంచడమే లక్ష్యమన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని ఆర్జించవచ్చన్నారు. ప్రతీ రోజు కొంత సమయాన్ని కొత్తపుస్తకాలు చదవడానికి కేటాయించాలని సూచించారు.

తంగళ్లపల్లిలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 3: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురిపై కేసులు నమోదు చేశారు. వాహనాలు తనిఖీ చేసి పత్రాలు లేనివారికి జరిమానా విధించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 3: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంగళవారం సిరిసిల్ల పట్టణం 18వ వార్డులో తెలంగాణ సాంస్కృతిక కళా బృందం అవగాహన కల్పించింది. తెలంగాణ సాంస్కృతిక కళా బృందం సారథి ఎడమల శ్రీధర్‌రెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ

గంభీరావుపేట సెప్టెంబరు 3: గంభీరావుపేట మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం, మహంకాళి అమ్మ ఆలయంలో చోరీ జరిగింది. సోమవారం రాత్రి దుండగులు ఆలయాల గేటు తాళాలను పగలగొట్టి లోనికి ప్రవేశించారు. హుండీలను పగలగొట్టి నగదును, బంగారు వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఎల్లమ్మ ఆలయంలో రూ.12 వేల నగదు, రూ.4 వేల విలువైన వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్ కూడా తీసుకెళ్లారు. మహంకాళి ఆలయంలో దొంగలు చొరబడి రూ.3 వేల నగదు రూ.21 వేల విలువ చేసే బంగారం ఎత్తుకెళ్లారు. పోలీసులు పరిశీలించి ఫింగర్ ప్రింట్స్ సేకరించారు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వీర్నపల్లి, సెప్టెంబరు 3: మండల కేంద్రంలోని వన్‌పల్లి, ఎర్రగడ్డ తండా గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. తడగొండకు చెందిన వర్షకు రూ. 24 వేలు, ఎర్రగడ్డ తండాకు చెందిన అంబిబాయికి 40 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను భూత శ్రీనివాస్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపద సమయాల్లో అభయ హస్తంగా సీఎం సహాయనిధి ఉందని అన్నారు. పేదలకు ఆర్థికభారం పడకుండా ఉండేందుకే సీఎం సహాయనిధి ఉందని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు రాములు నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు తిరుపతి యాదవ్, సీనియర్ నాయకులు నందగిరి శ్రీనివాస్, ప్రకాష్ నాయక్, బానోతు రాజు నాయక్, నక్క శ్రీనివాస్, భూక్య సంతోష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

లాల్‌సింగ్ తండాలో కుక్కల స్వైరవిహారం

వీర్నపల్లి, సెప్టెంబరు 3: మండలంలోని లాల్‌సింగ్ తండాలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మంగళవారం గొర్రెలమందపై కుక్కలు దాడి చేయగా భూక్య హరిలాల్‌కు చెందిన రెండు గొర్రెలు మృతిచెందాయి. వారం రోజుల కిందట ఇదే వ్యక్తికి చెందిన నాలుగు గొర్రెలపై కుక్కలు దాడి చేసి చంపిన ఘటన మరువకముందే ఈ ఘటన వెలుగుచూసింది. ఇటీవల గ్రామంలో కుక్కలు దాడి చేయగా మృతి చెందిన గొర్రెల సంఖ్య 18 చేరింది. పిచ్చికుక్కల విహారంతో గ్రామస్థులు భయందోళన చెందుతున్నారు.

ఎల్‌వోసీ మంజూరు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న కిషన్‌కు అత్యవసర చికిత్స అందించేందుకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎల్‌వోసీ (లైన్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేయించారని కాంగ్రెస్ నాయకులు మంగళవారం తెలిపారు. కిషన్‌కు అత్యవసర చికిత్స అవసరం ఉందని ప్రభుత్వ విప్ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రూ.1.50 లక్షల మంజూరు చేయించారని చెప్పారు. ఎల్‌వోసీ మంజూరు చేసిన ఆది శ్రీనివాస్‌కు కిషన్ కుటుంబసభ్యులతో పాటు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

కోనరావుపేట, సెప్టెంబరు 3: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ మండల నాయకుడు కచ్చకాయల మహేష్ అన్నారు. మండలంలోని సుద్దాల గ్రామంలో మంగళవారం వాలీబాల్ క్రీడాకారులకు 5వేలతో పాటు డ్రెస్‌లను అందజేశారు. కార్యక్రమంలో మాదిగ సంఘం అధ్యక్షుడు దేవయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఉద్యాన శంకర్, ప్రజాప్రతినిధులు దొబ్బల సంజీవ్, సామెల్ నరేష్, లింగయ్య, బుర్ర రమేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డుకు శ్రమదానం

కోనరావుపేట, సెప్టెంబరు 3: కోనరావుపేట మండలం బావుసాయిపేట వట్టిమల్ల గ్రామాల మధ్య భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. దీంతో ప్రమాదకరంగా గుంతగా మారడంతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా శ్రమదానంతో మరమ్మతులు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు నందు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఏఎస్పీ విచారణ

చందుర్తి, సెప్టెంబరు 3: చందుర్తి మండల కేంద్రంలో గ్రామ శివారులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఏఎస్పీ శేషాద్రి రెడ్డి మంగళవారం విచారణ చేశారు. మండల కేంద్రానికి చెందిన మేడికాల దేవరాజం అనే వ్యక్తి మార్త సత్తయ్యకు భూమి విక్రయించగా డబ్బులు అడగగా తనను కులం పేరుతో మార్త సత్తయ్య దూషించాడని దేవరాజం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు కాగా ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి విచారణ చేపట్టారు. ఆమె వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఏఎస్సై బాబు ఉన్నారు.



ఓ కన్నేయండి

- సీక్రెట్ కెమెరాలతో జాగ్రత్త - బ్లాక్ మెయిలింగ్‌కు గురయ్యే ప్రమాదం
- లేడీస్ హాస్టళ్లలోనూ అప్రమత్తత అవసరం - షాపింగ్‌మాల్స్‌లో పరిశీలన తప్పనిసరి
- పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెనకాడవద్దు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీతో అనేక లాభాలున్నా అక్కడక్కడ చోటుచేసుకుంటున్న కొన్ని సంఘటనలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రధానంగా షాపింగ్ మాల్‌లు, పని ప్రదేశాలు, హాస్టళ్లు, హోటళ్లు వంటి ప్రదేశాల్లో మహిళలు, యువతులు, విద్యార్థినులు సీక్రెట్ కెమెరాలు, సీసీ కెమెరాలపై ఓ కన్నేసి ఉంచాలి. అనుమానాలు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. నిర్వాహకులను నిలదీయాలి. పోలీసులు కూడా ఇటీవల కాలంలో పాఠ శాలలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నారు. జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

సిరిసిల్ల జిల్లా కేంద్రంగా ఏర్పడడంతో బహుళ జాతి కంపెనీల షాపింగ్‌మాల్స్ వెలిశాయి. విద్యారంగంలోనూ హబ్‌గా మారింది. మెడికల్ కాలేజీ. జేఎన్‌టీయూ, నర్సింగ్, వ్యవసాయ పాలిటెక్నిక్ నుంచి పీజీ వరకు, రెసిడెన్షియల్ పాఠశాలలు వంటివి అనేక విద్యా సంస్థలు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది జిల్లాకు వచ్చి చదువు కుంటున్నారు. మరోవైపు ఉపాధి, ఉద్యోగాలకు సంబంధించి మహిళలు జిల్లాకు వస్తున్నారు. షాపింగ్‌మాల్స్, రెడిమేడ్ వస్త్రాలు, ఇతర షాపులకు కొనుగోళ్లకు వెళ్లినప్పుడు రహస్య కెమెరాలు, సీసీ కెమెరాలపై ఓ కన్నేసి ఉంచాలి. మన ఇంటి చుట్టు పక్కలా కూడా గమనించడంతోపాటు అనుమానాలు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

అప్రమత్తతే రక్షణ

కొన్ని సందర్భాల్లో అప్రమత్తతే రక్షణగా నిలుస్తుంది. ధైర్యంతో వ్యవహరించాలి. పలువురికి ఆదర్శంగా నిలవాలి. కొన్ని సంఘటనలు ఎదురైనప్పుడు మహిళలు, యువతులు, విద్యార్థినులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక కుమిలిపోతుంటారు. మరోవైపు ఆధునిక సాంకేతిక టెక్నాలజీతో ఫొటోలు మార్ఫింగ్ చేసి యువతులను భయభ్రాంతులకు గురిచేస్తున్న సంఘటనలు ఉన్నాయి. షాపింగ్‌మాల్స్, హోటల్ గదులు, లేడీస్ హాస్టళ్లలో నిత్యం ఏదో ఒక చోట రహస్య కెమెరాల బారిన పడుతున్నారు. తాజాగా ఆంధ్రాలో గుడ్లవల్లేరు కాలేజీ హాస్టల్‌లో రహస్య కెమెరాల విషయం బయటపడడంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఒకే వీధిలో ఉంటూ స్నేహంగా ఉండే యువతీ యువకుల మధ్య సాధారణంగా స్నేహం ఉంటుంది. తోటి స్నేహితులే వీడియోలు తీసి వాట్సప్, ఫేస్‌బుక్‌లలో పోస్ట్ చేస్తుంటారు. ఒక్కోసారి సరదాగా తీసుకున్న వీడియోలు కూడా ఆత్మహత్యలకు దారి తీస్తుంటాయి. షాపింగ్‌మాళ్ల ట్రయల్ రూం, ఫ్లవర్ వాజ్‌లు, వాల్ క్లాక్‌లు, సీలింగ్ ఫ్యాన్లు, గిఫ్ట్ ఆర్టికల్స్, బటన్స్, కీ చైన్స్‌లలో అమర్చే విధంగా స్పై కెమెరాలు మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చాయి. వాటిని ఉపయోగించి మహిళలను ఇబ్బందికర పరిస్థితుల్లో పడేసే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి సందర్భాల్లో అప్రమత్తంగా ఉండి ధైర్యంగా పోరాడాలి.

ఫిర్యాదు చేసేందుకు వెనకాడవద్దు

అనుమతి లేకుండా సెల్‌ఫోన్‌లు, ఇతర మార్గాల ద్వారా ఫొటోల, వీడియోలు తీస్తే నేరమే అవుతుంది. మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ సెక్షన్ 509 ప్రకారం కేసు నమోదు చేయవచ్చు. పార్కులు, ఏకాంత ప్రదేశాల్లో అమ్మాయిలను వేధిస్తే నేరమే అవుతుంది. షాపుల్లో, హోటళ్లలో రహస్యంగా వీడియోలు తీసి ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెనకాడవద్దు. షీటీమ్‌లకు, సఖి సెంటర్‌లలో ఫిర్యాదు చేయవచ్చు. పోలీసులు కూడా ఇటీవల కాలంలో పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

మహిళలకు ప్రత్యేక చట్టాలు

- బూర సరిత, న్యాయవాది



మహిళలు ఏ సందర్భంలో వేధింపులకు గురైనా, సీక్రెట్ కెమెరాల బారిన పడినా ఫిర్యాదు చేయడానికి వెనకాడవద్దు. మహిళల కోసం ప్రత్యేకమైన చట్టాలు ఉన్నాయి. షీటీమ్‌లు, సఖి సెంటర్ల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చినపుడే జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టే వీలు ఉంటుంది. సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి.

బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి

- లోంకల కల్పలత, ప్రైవేటు ఉపాధ్యాయిని, ఎల్లారెడ్డిపేట



విద్యార్థినులు, యువతులు, మహిళలు బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితులు నెలకొంటున్నాయి. సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రతకంటే అభద్రతా భావం నెలకొంటోంది. కెమెరా వినియోగంపై ప్రత్యేక చట్టాలను రూపొందించి ఉన్నతస్థాయి అధికారులు పర్యవేక్షించాలి.

ప్రత్యేక అధికారులను నియమించాలి

- వంగాల లావణ్య, ప్రైవేటు ఉపాధ్యాయిని, ఎల్లారెడ్డిపేట



కళాశాలలు, పని ప్రదేశాలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్ తదితర దుకాణాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించాలి. కొందరు యువకులు షాపింగ్ మాల్స్‌లో రహస్య కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

చట్టాలను కఠినతరం చేయాలి

- దాసరి గాయత్రీ, డిగ్రీ విద్యార్థిని, ఎల్లారెడ్డిపేట



కళాశాలల్లో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించాలి. కళాశాల యాజమాన్యాలు, దుకాణాల నిర్వాహకులకు సూచనలు చేయాలి. రహస్య కెమెరాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకోవాలి. చట్టాలు కఠినతరం చేయాలి

కఠినంగా వ్యవహరించాలి

- కొడిముంజ సుమంగళి, ప్రైవేటు ఉపాధ్యాయిని, ఇల్లంతకుంట



మహిళలకు అనుకూలంగా చట్టాలను రూపొందించాలి. కొన్ని షాపింగ్ మాల్స్‌లో దుస్తులు మార్చుకునే ప్రదేశాల్లో రహస్యంగా కెమెరాలు బిగిస్తున్న సంఘటనలు వెలుగులోకి రావడం బాధాకరం. అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించినప్పుడే మహిళలకు భద్రత లభిస్తుంది.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై కేసు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 3: సిరిసిల్ల పట్టణ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌పై మంగళవారం కేసు నమోదైంది. ఇటీవల కాలంగా ఇసుక ట్రాక్టర్‌ల వే బిల్లులు, ఇసుక ట్రాక్టర్‌లపై కేసులలో అక్రమాలకు పాల్పడినట్లు సిరిసిల్ల టౌన్ ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఆర్ఐ సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3:ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట మంగళవారం ఎదురుగా వచ్చిన పాడిగేదెను ఢీకొనడంతో మండలంలోని పదిరకు చెందిన చిన్నమల్లయ్యగౌడ్ గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో సిరిసిల్లకు తరలించారు. చిన్నమల్లయ్యగౌడ్ తన ద్విచక్రవాహనంపై ఎల్లారెడ్డిపేట నుంచి పదిర గ్రామానికి వెళుతున్న క్రమంలో ఒక్కసారిగా పాడి గేదె అడ్డు వచ్చింది. వాహనం అదు పు తప్పి ఢీకొట్టాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

చెరువు కట్టకు గండి

చందుర్తి, సెప్టెంబరు 3: మండలంలోని అశిరెడ్డిపల్లి గ్రామ శివారులోని అయ్యోరుకుంట కట్టకు గండి పడింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గడ్డపారతో కట్టను తవ్వడంతోనే గండి పడినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గండిపడడంతో కుంటలోని నీరు వెళ్లిపోయి కుంట ఖాళీ అయినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట పరిధిలోని కిషన్‌దాస్‌పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి మంగళవారం గ్లాసులను పంపిణీ చేశారు. హెచ్ఎం రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట మండలం దుమాల మాజీ సర్పంచ్ రామిండ్ల మోషయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.

చందుర్తి: మండలంలోని కట్టలింగంపేటలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎల్ల నర్సవ్వ కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ నాయకులు నిత్యావసర సరుకులను అందజేశారు.

'హైడ్రా'ను స్వాగతిస్తున్నాం



సిరిసిల్లలో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 3: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పాటు చేసిన హైడ్రాను స్వాగతిస్తున్నామని తెలంగాణ సహజ వనరుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు దేవయ్య అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో సమితి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో దేవయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందనగిరి గోపాల్ మాట్లాడారు. జీహెచ్ఎంసీ పరిధిలో చెరువులు, నాళాలను ఆక్రమించి చేపట్టిన విల్లాలు, కన్వెన్షన్లను హైడ్రా కమిషనర్ రంగనాథ్ సారథ్యంలో కూల్చివేయడాన్ని సమర్థిస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అక్రమార్కులు చెరువులు, కుంటలు, నాళాలు, గుట్టలను కబ్జాలు చేశారని ఆరోపించారు. హైడ్రాను జీహెచ్ఎంసీకే పరిమితి చేయకుండా జిల్లాలకు విస్తరింప జేయాలని విజ్ఞప్తి చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు హైడ్రాను విస్తరింప జేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వేములవాడ మూలవాగు పక్కన అక్రమ నిర్మాణాలను హైడ్రా ద్వారా కూల్చాలని కోరారు. సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులి రాంబాబు, రాష్ట్ర కోశాధికారి వాసం మల్లేశం యాదవ్, జిల్లా నాయకులు బుర్ర మల్లేశం గౌడ్, తాళ్లపల్లి ప్రభాకర్, రంగు అంజయ్యగౌడ్, అలువాల లక్ష్మణ్, ఊరకొండ వేణు, ఆయుధాల రాజు, బొల్లె ప్రశాంత్, నసీం, అరుణకుమార్ పాల్గొన్నారు.

రేపు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 3 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు డీఈవో రమేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారి వివరాలు వెల్లడించారు. వేములవాడ అర్బన్ పరిధిలోని కోనాయిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు బి.సదానందం, ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు కృష్ణహరితోపాటు స్కూల్ అసిస్టెంట్ సిరిసిల్ల జిల్లా పరిషత్‌కు చెందిన గోవిందరావు, గంభీరావుపేట మండలం లింగన్నపేట జిల్లా పరిషత్‌కు చెందిన రాజిరెడ్డి, సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట జిల్లా పరిషత్‌కు చెందిన రవి, బోయినపల్లి మండలం విలాసాగర్‌కు చెందిన వసుందర, వేములవాడ అర్బన్ కోనాయిపల్లి జిల్లా పరిషత్‌కు చెందిన నీరజ, కోనరావుపేట మండలం వట్టిమల్ల జిల్లా పరిషత్‌కు చెందిన శరత్‌కుమార్, తంగళ్లపల్లి మండలం మండెపల్లి జిల్లా పరిషత్‌కు చెందిన రాంచందర్‌రావు, ముస్తాబాద్ మండలం ఆవునూర్ జిల్లా పరిషత్‌కు చెందిన లక్ష్మీనారాయణ, గంభీరావుపేట ఉర్దు మీడియం పాఠశాలకు చెందిన రవి, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాడు సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ బాబాజీ నగర్ మండల పరిషత్ పాఠశాలకు చెందిన ఆర్. రాజు, ఫిజికల్ డైరెక్టర్‌లు బోయినపల్లి మండలం విలాసాగర్ జిల్లా పరిషత్‌కు చెందిన ప్రభాకర్, సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జిల్లా పరిషత్‌కు చెందిన సురేష్, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ పాఠశాలకు చెందిన శోభారాణి, వీర్నపల్లి మండలం రంగంపేట మండల పరిషత్ పాఠశాలకు చెందిన లచ్చిరెడ్డి, సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ బాబాజీనగర్ మండల పరిషత్ పాఠశాలకు చెందిన శంకరయ్య, కోనరావుపేట మండలం కనగర్తి మండల పరిషత్ పాఠశాలకు చెందిన మధు, ఎల్లారెడ్డిపేట మండలం సింగారం మండల పరిషత్ పాఠశాలకు చెందిన ఎల్లారెడ్డి, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలకు సంబంధించిన తంగళపల్లికి చెందిన శారద, వీర్నపల్లికి చెందిన పద్మ, వేములవాడ అర్బన్‌కు చెందిన మధులత, ఇల్లంతకుంటకు చెందిన అర్చన, తెలంగాణ మోడల్ స్కూళ్లకు సంబంధించి కోనరావుపేటకు చెందిన కోండల్‌రావు, ఇల్లంతకుంటకు చెందిన బాబు, తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ నేరెళ్లకు చెందిన మంజులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

నష్టం వివరాలు సేకరిస్తున్నాం


మైసమ్మ చెరువు తూమును పరిశీలిస్తున్న తహసీల్దార్ రామచంద్రం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3: మూడు రోజులు కురిసిన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఎల్లారెడ్డిపేట మండలంలోని గ్రామాల్లో అధికారులు మంగళవారం పర్యటించారు. మండల కేంద్రంతోపాటు తిమ్మాపూర్, అల్మాస్‌పూర్, రాచర్లగొల్లపల్లి, దుమాల, అక్కపల్లి, పదిర, బండలింగంపల్లి, నారాయణపూర్ గ్రామాల్లోని వాగులు, చెరువులను పరిశీలించారు. కూలిన ఇళ్ల వివరాలను సేకరించారు. నష్టంపై అంచనా వేస్తున్నామని తహసీల్దార్ రామచంద్రం పేర్కొన్నారు. పలు గ్రామాల్లో నేలకూలిన ఇళ్ల బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, మత్తడి దూకుతున్న చెరువుల వద్ద సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. చేపలు పటేందుకు వచ్చిన ప్రజలను అక్కడి నుంచి పంపి వేశారు. ఆయా గ్రామాల్లో కూలిన ఇళ్లను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. నాయబ్ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ సంతోష్, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, రాంరెడ్డి, రాజయ్య, బాలయ్య, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

చందుర్తి, సెప్టెంబరు 3 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని చందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్-14, అండర్-17, బాలికలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, మండల స్థాయి క్రీడలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో వివిధ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకుందాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 3: జిల్లాలో గణేష్ నవరాత్సోవాలను వైభవంగా నిర్వహించుకుందామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా ఏర్పాట్లపైనా, తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా వినాయక మండపాల నిర్వాహకులు, బాధ్యులు, ఆయాశాఖల అధికారులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, ముస్లిం, క్రైస్తవ ప్రతినిధులతో జిల్లా శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరు ఐక్యమత్యంతో జరుపుకోవాలని కోరారు. మన దేశ సంస్కృతీసంప్రదాయాలు ఇతర దేశాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయన్నారు. పండుగకు రాష్ట్రప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. మండపాల నిర్వాహకులు, యువత అధికారులు చెప్పే సలహాలను పాటించాలని సూచించారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పోలీస్ శాఖ నిబంధనల మేరకు రెండు సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే వినాయక నవరాత్రి ఉత్సవాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమావేశాన్ని నిర్వహించారని గుర్తుచేశారు.

సమన్వయంతో విజయవంతం చేయాలి

ఈ నెల 7వ తేదీన ప్రారంభమయ్యే వినాయక నవరాత్రి ఉత్సవాలు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్‌సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్, సెస్, మత్స్యశాఖ, పోలీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లపై చర్చించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా క్రేన్స్, జేసీబీలు, విద్యుత్ దీపాలు, నీటి సదుపాయం కల్పించాలని కమిషనర్లను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడలో 18 మంది చొప్పున జాలర్లను నియమిస్తామని ఆ శాఖ అధికారులు తెలుపగా మరో పదిమందిని రిజర్వులో ఉంచాలని, లైఫ్‌జాకెట్లులను సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 108, 24గంటలు క్విక్ రెస్పాన్స్ టీంలు, మందులు అందుబాటులో ఉంటాయని జిల్లా వైద్యాధికారి వసంత్‌రావు తెలిపారు. ఎక్సైజ్, అగ్నిమాపక శాఖలు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీఅఖిల్ మహజన్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా వివరాలను ఇవ్వాలని సూచించారు. ఆయా తేదీల్లో విగ్రహాలను నిర్ణీత సమయానికి తరలించి రాత్రి రెండు గంటలవరకు నిమజ్జం చేసేలా సహకరించాలని కోరారు. పోలీస్‌శాఖ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలని వివరించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందంకళాచక్రపాణి, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థం మాధవి, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, మున్సిపల్ కమీషనర్లు మీర్జా ఫసహత్ అలీబేగ్, సంపత్‌రెడ్డి, అధికారులు నాయకులు పాల్గొన్నారు.


పాల్గొన్న నిర్వాహకులు, అధికారులు, నాయకులు